


# భాగ్యనగరిలో 'పెద్ది' పోరాటాలు

రామ్‌చరణ్ నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' నిర్మాణం నుంచే దేశవ్యాప్తంగా భారీ హైప్ క్రియేట్ చేస్తున్నది. ముఖ్యంగా ఫస్ట్‌గ్లింప్స్ ఒక్కసారి సినిమాపై అంచనాల్ని పెంచింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇందులో ట్రైన్ సెట్‌ను తీర్చిదిద్దారు కళా దర్శకుడు అవినాష్ కొల్లా. రామ్‌చరణ్ రిస్కీ స్టంట్స్ చేస్తున్నారని, 'పుష్ప-2'తో పేరుపొందిన యాక్షన్ కొరియోగ్రాఫర్ నబాకాంత్ ఈ ఫైట్ సీక్వెన్స్‌కు రూపకల్పన చేశారని చిత్రబృందం పేర్కొంది. భారతీయ సినీ చరిత్రలో యాక్షన్ పరంగా కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తూ ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. క్రికెట్, మల్లయుద్ధంతో పాటు మరికొన్ని గ్రామీణ క్రీడల నేపథ్యంలో యాక్షన్‌గా డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న విడుదలకానుంది. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.



# మా సంస్థ విలువను పెంచుతుంది

'మా సంస్థలో 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత 'తమ్ముడు' సినిమాతో మీ ముందుకొస్తున్నాం. మా బ్యానర్‌లో తొలిసారి బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. తప్పకుండా ఈ సినిమా అందరికి నచ్చుతుంది' అన్నారు అగ్ర నిర్మాత దిల్ రాజు. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'తమ్ముడు' జూలై 4న ప్రేక్షకుల ముందుకురానుంది. నితిన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలోని 'భూ అంటూ భూతం' అనే తొలి గీతాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం 80రోజులు అడవిలో షూటింగ్ చేశాం. ఫ్యామిలీస్, యూత్, పిల్లలు అందరూ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. థియేటర్స్ నుంచి బయటకు వచ్చే ముందు ఓ ఫీల్‌గుడ్ మూవీని చూశామనే అనుభూతి కలుగుతుంది. మా బ్యానర్ విలువను పెంచే సినిమా ఇది' అని చెప్పారు. కథలోని ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని హీరో నితిన్ తెలిపారు. చాలా విరామం తర్వాత తెలుగులో నటించానని, కుటుంబ అనుబంధాలకు పెద్దపీట వేసిన కథ ఇదని నటి లయ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, రచన-దర్శకత్వం: శ్రీరామ్ వేణు.



# ఫీల్‌గుడ్ రొమాంటిక్ స్టోరీ

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా'. స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం హైదరాబాద్‌లో చివరి షెడ్యూల్ ప్రారంభమైంది. ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో నాయకానాయికలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని, దీనితో షూటింగ్ మొత్తం పూర్తవుతుందని, డబ్బింగ్ పనులను కూడా మొదలుపెట్టామని చిత్రబృందం పేర్కొంది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా అలరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: తమన్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్, రచన-దర్శకత్వం: నీరజ కోన.



# మెగా 157కోసం ముస్సోరికి..

అగ్ర కథానాయిక నయనతార రూట్ మార్చుకుంది. సినిమా ప్రమోషన్స్‌కు దూరంగా ఉండే ఈ భామ ఇప్పుడు ప్రచార వీడియోలతో సందడి చేస్తున్నది. ఇదంతా చిరంజీవి 157వ సినిమా కోసం కావడం విశేషం. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మెగా157 వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయిక. ఈ సినిమా కోసం ఇటీవల నయనతార ఓ ప్రమోషనల్ వీడియోను విడుదల చేయగా..దానికి అద్భుతమైన స్పందన లభించింది. ముమ్ముందు సినిమా ప్రచార కార్యక్రమాల్లో నయనతార అదరగొట్టబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముస్సోరిలో జరుగుతున్నది. ఈ షూట్‌లో నయనతార జాయిన్ అయ్యారు. కామెడీ ప్రధానంగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన వీడియోలో చిరంజీవి వింటేజ్ అవతార్‌లో కనిపించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.



# 'లెనిన్' సినిమా కథ అదేనా?

యువ హీరో అక్కినేని అఖిల్ కెరీర్‌లో ఓ భారీ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజా చిత్రం 'లెనిన్'పైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. అఖిల్ లుక్స్, పర్‌ఫార్మెన్స్ బాగుందని ప్రశంసలొచ్చాయి. ఈ సినిమాపై ఇప్పటికే పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. అ నేపథ్యంలో ఈ సినిమా కథ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ ప్రచారంలోకి వచ్చింది. రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. గ్లింప్స్‌లో అఖిల్ రాయలసీమ యాసలో చెప్పిన డైలాగ్స్ కూడా మెప్పించాయి. అయితే ఈ సినిమా కథలో పరువు హత్యల నేపథ్యం ప్రధానంగా ఉంటుందని తెలుస్తున్నది. గ్రామంలోని ఓ ఆలయం చుట్టూ కథ నడుస్తుందని, బలమైన సామాజికాంశాలను కూడా చర్చించారని టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మురళీకిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్నారు.





# ఇండియా మొత్తంలో ఒక్క అమ్మాయే..

'ఈ సినిమా చూసిన తర్వాత ప్రతీ ఒక్కరికి ప్రేమతత్వం బోధపడుతుంది. థియేటర్‌కు వెళ్లిన ప్రేక్షకులు ప్రేమను గుండెల్లో నింపుకొని తిరిగొస్తారు. ఈ సినిమా ఓపెనింగ్ సీక్వెన్స్ అస్సలు మిస్ కావొద్దు. ఎందుకంటే రివర్స్ స్క్రీన్‌ప్లేతో నడిచే చిత్రమిది' అన్నారు ఫణీంద్ర నర్సెట్టి. ఆయన దర్శకత్వంలో అనంతిక సనీల్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పొయెటిక్ లవ్‌స్టోరీ '8వసంతాలు'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నాయిక పాత్రకోసం క్లాసికల్ డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్ రెండూ తెలిసిన అమ్మాయి కావాలని ఇండియా మొత్తం వెతికితే ఒక్క అమ్మాయి దొరికింది. తనే అనంతిక. ఈ చిత్రంలో ఆమె అద్భుతంగా పర్‌ఫార్మ్ చేసింది' అన్నారు. ఈ సినిమాలో తాను శుద్ధి అయోధ్య అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, కథలోని భావోద్వేగాలు ప్రతీ ఒక్కరికి కనెక్ట్ అవుతాయని కథానాయిక అనంతిక పేర్కొంది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలు కలబోసిన చిత్రమిదని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు.

# నష్టపోయినా..ఏ విషయంలోనూ బాధపడలేదు!

దర్శకుడిగా 25ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు శేఖర్ కమ్ముల. సుదీర్ఘ కెరీర్‌లో తీసినవి పది సినిమాలే అయినా అవన్నీ వేటికవే ప్రత్యేకం. మానవ సంబంధాల పట్ల ప్రేమ, సామాజిక పరివర్తన కోసం తపన, మనదైన సంస్కృతిపై మమకారం ప్రధానాంశాలుగా ఆయన సినిమాలు ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఆయన ఆర్థిక అంతరాల్ని చర్చించే 'కుబేర'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల బుధవారం పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..



- ఈ సినిమా కథకు ప్రేరణ అంటూ ఏమీ లేదు. సమాజంలో ఆర్థిక అంతరాల నేపథ్యంతో రాసుకున్నా. సంపన్నుడు వర్సెస్ బిచ్చగాడు..వీరి మధ్య సంఘర్షణ ఎలా ఉంటుందన్నదే కథలో ప్రధానాంశం. నిజంగా ఇలాంటి కథ చెప్పడం చాలా కష్టం. చాలా పెద్ద పాయింట్ ఇది. కానీ కథపై వర్క్ చేస్తున్న కొద్దీ ఎమోషనల్ థ్రిల్లర్‌గా తయారయింది.
- ప్రపంచంలో అన్నీ తనకే కావాలనుకునే ఒక మిలియనీర్, తనకు ఏమీ వద్దనుకునే బిచ్చగాడి మధ్య కథ నడుస్తుంది. ఈ మధ్యకాలంలో ఇలాంటి కథ రాలేదు. ప్రజల్లో ఎంతో కొంత మార్పు తీసుకొస్తుందనే నమ్మకంతో ఈ సినిమా చేశా. తమిళం, తెలుగు భాషల్లో ఏకకాలంలో షూట్ చేశాం. సాంకేతికంగా రెండు సినిమాలు తీసినట్లే అనుకోవచ్చు. అందుకే ఎక్కువ సమయం తీసుకుంది.
- కొన్ని పాత్రలు నాగార్జునగారే చేయాలనిపిస్తుంది. ఇది అలాంటిదే. బిలియనీర్ పాత్ర ఆయనకు పర్‌ఫెక్ట్‌గా కుదిరింది. నాగార్జునగారిని తెరపై చూస్తే ఏదో మ్యాజికల్ ఫీలింగ్ కలుగుతుంది. ఇప్పటికీ మన్మథుడిలా ఉంటారు. అందుకే ఆయన్ని డిఫరెంట్ మేనరిజమ్స్, స్టైల్‌లో చూపించడం జరిగింది.
- ఇక సినిమాలో దేవా పాత్రను ధనుష్ తప్ప మరెవరూ చేయలేరు. సినిమా చూశాక ఆడియెన్స్ కూడా అదే మాట చెబుతారు. అవుట్ స్టాండింగ్ పర్‌ఫార్మెన్స్ అనడం చాలా చిన్న మాట అవుతుంది. అంతలా తన క్యారెక్టర్‌లో లీనమైపోయారు. ఎంత కష్టమైన సీన్ అయినా సింగిల్ టేక్‌లో చేస్తారాయన. రష్మిక మందన్న క్యారెక్టర్ కూడా చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది.
- ప్రేక్షకులు 'ఇది శేఖర్ కమ్ముల మార్క్ సినిమా' అంటుంటారు. అయితే ఏదో ప్రత్యేకమైన ముద్ర కోసం నేనెప్పుడూ సినిమాలు చేయలేదు. కథకు ఏం కావాలో అదే చేశాను. 'హ్యాపీడేస్' కాలేజీ స్టోరీ కాబట్టి ఫన్, ఎమోషన్స్‌తో సాగుతుంది. 'కుబేర' కథ కూడా అంతే. మార్క్ అనేది కథ ప్రకారమే ఉంటుంది. నేను ఏ సినిమానైనా నిజాయితీగా తీస్తాను. అది 'కుబేర'లో పదింతలు కనిపిస్తుంది.
- ముంబయిలో భిన్న సంస్కృతులు కనిపిస్తాయి. అదో మినీ భారతదేశం. ఇలాంటి ఆర్థిక అంతరాల కథకు ముంబయి పర్‌ఫెక్ట్ నేపథ్యం అనిపించింది. ఎక్కువభాగం అక్కడే షూటింగ్ చేశాం. కథాపరంగా ముంబయిలో తీయడం తప్పనిసరై పోయింది. ముంబయిలో షూటింగ్ కూడా కష్టంగానే అనిపించింది. ఎందుకంటే అక్కడ పర్మిషన్స్ సులభంగా లభించవు. ప్రతీ చోటా రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది.
- వ్యక్తిగత జీవితంలో నేను చాలా సింపుల్‌గా ఉంటాను. ఎవరి దగ్గరా ఏదీ ఆశించలేదు. సినిమాల విషయంలో కూడా లాభాల్లో వాటా కావాలని ఏరోజూ డిమాండ్ చేయలేదు. నా పారితోషికం మాత్రమే తీసుకుంటా. దాని వల్ల చాలా నష్టపోయిన సందర్భాలున్నాయి. అయినా ఏ విషయంలోనూ బాధపడలేదు. ప్రేక్షకులు ఎంతో ప్రేమని ఇచ్చారు. నాపై ఓ నమ్మకాన్ని ఉంచారు. దానిని నిలబెట్టుకున్నా. అది అన్నింటికంటే ఎక్కువగా ఆనందాన్నిచ్చే విషయం.
- 'కుబేర'కు సీక్వెల్ ఉండదు. కథ అక్కడితో ఆగిపోతుంది. ఇక 'లీడర్'కు సీక్వెల్ గురించి ఎప్పుడూ ఆలోచిస్తుంటాను. అయితే అప్పటికీ ఇప్పటికీ సమాజం, పరిస్థితులు చాలా మారిపోయాయి. వాటిని సరిగ్గా అర్థం చేసుకుంటేనే సీక్వెల్ కథ రాయొచ్చు. నానితో సినిమా చేసే ఆలోచన ఉంది. అయితే ఇంకా కథ సిద్ధం చేయలేదు. ఆ సినిమాకు ఇంకా సమయం పడుతుంది.

# 120కోట్ల డీల్ వద్దనుకున్నాడు!



ఓటీటీ వల్ల థియేటర్ల వ్యవస్థ ప్రమాదంలో పడుతున్నదని, ప్రేక్షకులు సినిమాకు దూరమైపోతున్నారని అమీర్‌ఖాన్ గత కొంతకాలంగా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అందుకే తన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్'ను ఓటీటీలో విడుదల చేసే ప్రసక్తే లేదని, థియేట్రికల్ రిలీజ్ అనంతరం యూట్యూబ్‌లో పే పర్ వ్యూ విధానంలో అందుబాటులో ఉంచుతానని ప్రకటించాడు. అమీర్ తీసుకున్న ఈ నిర్ణయం సంచలనంగా మారింది. ఓటీటీ సంస్థల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో 'సితారే జమీన్ పర్' సినిమా విషయంలో అమీర్‌ఖాన్ దాదాపు 120 కోట్ల భారీ ఆఫర్‌ను తిరస్కరించారని తెలిసింది. ఈ సినిమా ఓటీటీ హక్కుల కోసం అమెజాన్ ప్రైమ్ ఆసక్తిని కనబరచిందట. అందుకోసం 120 కోట్ల భారీ డీల్‌ను ఆఫర్ చేసిందట. అయితే అమీర్‌ఖాన్ ఆ ఆఫర్‌ను తిరస్కరించారని, ఓటీటీల విషయంలో తన నిర్ణయంలో మార్పు ఉండదని చెప్పారని తెలిసింది. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కించిన 'సితారే జమీన్ పర్' ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. అమీర్ ఖాన్, జెనీలియా డిసౌజా కీలక పాత్రల్లో నటించారు.

